సాక్షి
అనంతపురం
సోమవారం । 17 । మార్చి । 2025




### నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు.



### టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 6, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.




## న్యూస్‌రీల్

### పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు



పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం అర్బన్:** ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమంలో పొట్టిశ్రీరాములు చురుగ్గా పాల్గొన్నారన్నారు. తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలంటూ మద్రాసులో 1952 అక్టోబరు 19న బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించి డిసెంబరు 15న అసువులు బాసారన్నారు. ప్రతి ఒక్కరూ ఆ మహనీయుడి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ ఎ.మలోల, తదితరులు పాల్గొన్నారు.

### అమ్మూ... ఇక నేను బతకలేనమ్మా!

- బేకరీ షాపు నిర్వాహకుడి ఆత్మహత్య



జయప్రకాష్ మృతదేహం

**బత్తలపల్లి:** బేకరీ వ్యాపారం సరిగా జరగకపోవడంతో కుమార్తె వివాహం, కుమారుడి చదువుకు డబ్బు ఎలా సమకూర్చాలో తెలియక షాపు నిర్వాహకుడు సతమతమయ్యాడు. రోజూ ఇవే ఆలోచనలు చేసి.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమార్తెకు వీడియో కాల్ చేసి 'అమ్మూ.. ఇక నేను బతకలేనమ్మా' అంటూ చెప్పి ఉరివేసుకున్నాడు. వివరాలు.. కేరళకు చెందిన పరంబత్ జయప్రకాష్ (55) 35 ఏళ్ల క్రితం శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లికి వలస వచ్చాడు. తొలుత ఓ బేకరీ షాపులో పనిచేశాడు. తర్వాత కదిరి రోడ్డులో సొంతంగా 'మైసూర్ బేకరీ' షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఇక్కడే లక్ష్మీకళ అనే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె రిన్నా, కుమారుడు రోహన్ ఉన్నారు. రిన్నా ప్రస్తుతం జపాన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా.. రోహన్ బెంగళూరులో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. కొంత కాలంగా బేకరీ షాపులో వ్యాపారం సరిగా జరగకపోవడంతో జయప్రకాష్ ఆందోళన చెందుతుండేవాడు. దీనికితోడు రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణం తొలగిస్తారని భయపడేవాడు. ఈ విషయాలను భార్యతో చెప్పుకుని మదనపడుతుండేవాడు. అమ్మూ (రిన్నా) వివాహం ఎలా చేయాలి, అప్పూ (రోహన్) చదువులకు డబ్బు ఎలా సమకూర్చాలో అర్థం కావడం లేదంటూ బాధ పడేవాడు. ఎప్పటికప్పుడు భార్య ధైర్యం చెప్తూ వస్తోంది. బెంగళూరులో తన బంధువుల ఇంట్లో జరుగుతున్న సీమంతం కార్యక్రమానికి లక్ష్మీకళ శనివారం వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉన్న జయప్రకాష్ ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కుమార్తెకు వీడియో కాల్ చేసి 'నేను చనిపోతానమ్మా.. ఇక బతకను' అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. వెంటనే ఆమె బెంగళూరులో ఉన్న తల్లికి విషయం చెప్పింది. బత్తలపల్లిలోని ఇంటి సమీపంలో ఉన్న సాంబశివుడుకు లక్ష్మీకళ ఫోన్ చేసి అప్రమత్తం చేసింది. అతడు వెళ్లి చూసేసరికి జయప్రకాష్ బేకరీ షెడ్‌లో ఉరికివేలాడుతూ నిర్జీవంగా కనిపించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# చీనీ ఫలం.. ఏదీ ధరహాసం?



- గిట్టుబాటు ధరల్లేక దిక్కులు చూస్తున్న రైతులు
- మార్కెటింగ్ అనుకూలంగా లేక అల్లాడిపోతున్న వైనం
- నోరుమెదపని చంద్రబాబు సర్కారు

**అనంతపురం అగ్రికల్చర్:** చీనీ ధరలు పెరగడం లేదు. నెలన్నర రోజులుగా టన్ను రూ.22 వేలకు మించి పలకడం లేదు. గిట్టుబాటు ధరల కోసం రైతులు దిక్కులు చూస్తున్న పరిస్థితి నెలకొంది. చేసేదేమీ లేక తోటల్లో కోతలు ఆలస్యం చేస్తున్నారు. అమ్మకానికి కాయలు సిద్ధంగా ఉన్నా మార్కెటింగ్ పరిస్థితులు అనుకూలంగా లేక అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ ధరలు మరింత పతనావస్థకు చేరుకుంటుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చీనీ రైతులు ఇబ్బంది పడుతున్నా చంద్రబాబు సర్కారు మాత్రం చోద్యం చూస్తోందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ క్రయవిక్రయాలు

**చీనీ కేరాఫ్ 'అనంత'..**

మొదటి నుంచి అనంతపురం జిల్లా చీనీ తోటలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఇక్కడి రైతులు ప్రతికూల పరిస్థితులను అధిగమించి మరీ నాణ్యమైన చీనీ కాయలు పండిస్తున్నారు. జిల్లాలో 92 వేల ఎకరాల భారీ విస్తీర్ణంలో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. ఏటా 5.20 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఫలసాయం లభిస్తోంది. వాటి ద్వారా సరాసరి రూ.1,600 కోట్ల మేర టర్నోవర్ జరుగుతున్నట్లు ఉద్యాన శాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రధానంగా గార్లదిన్నె మండలంలో అత్యధికంగా 18 వేల ఎకరాలు, యల్లనూరులో 11,296 ఎకరాలు, కూడేరులో 9,300, పామిడి 5,300, నార్పలలో 5,200, పుట్లూరులో 5 వేలు, ఆత్మకూరులో 4,200, అనంతపురంలో 3,900, పెద్దపప్పూరులో 3,500 ఎకరాలు... ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో చీనీ తోటలు విస్తరించాయి. ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు క్రయ విక్రయాలు జోరుగానే ఉంటాయి. ఏడాది పొడవునా మూడు సీజన్లలోనూ చీనీ పంట పండిస్తున్నారు. దీంతో అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గత ప్రభుత్వం ఏడాది పొడవునా మార్కెట్ నిర్వహించేలా చర్యలు తీసుకుంది.

**ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి..**

జిల్లాలో పండించే చీనీలో 70 నుంచి 80 శాతం వరకు రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ లాంటి ఉత్తరాది ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. చీనీ తోటకు ఎకరాకు ఏటా రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. టన్ను రేటు రూ.40 వేలు, అంతకన్నా ఎక్కువ లభిస్తే కానీ గిట్టుబాటు కాదని చెబుతున్నారు. అయితే గత నెలన్నర రోజులుగా మార్కెట్‌యార్డులో టన్ను రూ.22 వేలకు మించి పలకడం లేదు. ఒకట్రెండు లాట్లు కాస్త ఎక్కువ ధర పలికినా... చాలా వరకు రూ.15 వేల లోపు, ఇంకొన్ని రూ.5 వేలకు మించి పలకడం లేదు. తోటల్లో అయితే 10 టన్నులకు రెండు టన్నులు సూటు వ్యవస్థ అమలు చేస్తున్నారు. అప్పనంగా రెండు టన్నులు దళారులు, వ్యాపారుల పాలవుతోంది. డబుల్ సూట్, అధిక కమీషన్ వ్యవస్థను నివారించే వారు కరువయ్యారు. దీంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు.

**అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ క్రయ విక్రయాలు ఇలా..**

| నెల | చీనీ అమ్మకాలు (టన్నులు) | టన్ను గరిష్ట ధర (రూ. లలో) | సరాసరి ధర (రూ.లలో) | కనిష్ట ధర (రూ.లలో) |
|---|---|---|---|---|
| ఏప్రిల్(2024) | 17,909 | 41వేలు | 23 వేలు | 12 వేలు |
| మే | 18,116 | 36 వేలు | 20 వేలు | 12 వేలు |
| జూన్ | 16,591 | 38 వేలు | 20 వేలు | 10 వేలు |
| జూలై | 21,482 | 23 వేలు | 14 వేలు | 2,500 |
| ఆగస్టు | 10,189 | 24 వేలు | 15 వేలు | 8 వేలు |
| సెప్టెంబర్ | 753 | 24 వేలు | 15 వేలు | 10 వేలు |
| అక్టోబర్ | 86 | 33 వేలు | 16 వేలు | 8 వేలు |
| నవంబర్ | 1,475 | 39,200 | 18 వేలు | 5 వేలు |
| డిసెంబర్ | 684 | 40,100 | 20 వేలు | 4 వేలు |
| జనవరి(2025) | 454 | 30 వేలు | 15 వేలు | 5 వేలు |
| ఫిబ్రవరి | 1,407 | 24,300 | 14 వేలు | 3 వేలు |
| మార్చి | 3,200 | 23 వేలు | 12 వేలు | 6 వేలు |

**కోలుకోవడం కష్టం..**



మార్కెట్ పరిస్థితి ఇలాగే ఉంటే చీనీ రైతులకు కష్టాలు తప్పవు. టన్ను రూ.20 వేలు, రూ.30 వేలు ఉంటే పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి రావు. కనీసం రూ.50 వేలు పలికితే కానీ ఉపశమనం లభించదు. 5 ఎకరాల్లో 750 చీనీ చెట్లు సాగు చేశా. ఈ సారి ప్రతికూల వాతావరణం వల్ల దిగుబడులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ధర కూడా లేకుంటే కోలుకోవడం కష్టంగానే ఉంటుంది.

– కొల్లాకర్, పెనకచర్ల, గార్లదిన్నె మండలం

### సూర్య, చంద్రప్రభ వాహనాలపై నృసింహుడి విహారం



సూర్యప్రభ వాహనంపై దేవదేవుడు

**కదిరి:** ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజైన ఆదివారం శ్రీవారు పగలు సూర్య ప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై విహరించారు. లోకంలో పుట్టడం, పెరగడం, నశించడం అనే మూడు ప్రక్రియలు కాలాధీనాలు. ఆ కాల స్వరూపుడిని తానే అంటూ చాటి చెబుతూ శ్రీవారు సూర్య, చంద్ర ప్రభలనధిష్ఠించి దర్శనమిచ్చారు. సూర్య మండల మధ్యస్థుడైన శ్రీ మహా విష్ణువుకు నారాయణుడని పేరు. పగటికి సూర్యుడు రారాజైతే, రేయికి చంద్రుడు అధిపతి. సృష్టికి ఎంతో ముఖ్యమైన ఈ రేయింబవళ్లను శ్రీమహావిష్ణువు రెండు కళ్లుగా కలిగి ఉండి వాటినే వాహనాలుగా మార్చుకొని సృష్టిలో సర్వమూ తానే అని చాటిచెబుతూ తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవ ఉభయదారులుగా అంబే శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో సోమవారం మోహినీ ఉత్సవం నిర్వహించనున్నారు.



చంద్రప్రభ వాహనంపై శ్రీవారు


# బాధితులకు అండగా ఉంటాం

- పేదల ఆర్తనాదాల మధ్య పరిటాల కుటుంబం జయకేతనాలు
- హైకోర్టు ఆదేశాలకు పూర్తి విరుద్ధంగా కూల్చివేతలు
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**అనంతపురం ఎడ్యుకేషన్:** 'అనంతపురం రూరల్ పాపంపేట పొలం 106–1 సర్వే నంబరులోని 68 సెంట్లలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారి భవనాలను చట్ట విరుద్ధంగా, హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ, ఎలాంటి సర్వే లేకుండా, నోటీసులు ఇవ్వకుండా కూల్చి వేశారు. 150 మంది పోలీసులను తీసుకొచ్చి, ప్రైవేట్ సైన్యాన్ని మోహరించి దుర్మార్గంగా పేదల నివాసాలపై దాడులు చేశారు. బాధితులకు అండగా నిలబడి న్యాయం కోసం పోరాడతాం' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ జడ్జి కిష్టప్ప అక్కడికి వెళ్తే పక్కకు నెట్టేశారని, జడ్జిగా పని చేసిన వ్యక్తికి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. పేదల ఆర్తనాదాల మధ్య పరిటాల కుటుంబం జయకేతనాలు ఎగురవేస్తోందన్నారు. 'ఏ కోర్టు ద్వారా భవనాలను కొట్టించారో అదే కోర్టు ద్వారా బాధితులకు స్థలాలు ఇప్పిస్తాం' అని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు మునిసిపాలిటీ పరిధిలోని భూమిని స్వాధీనం చేయాల్సి ఉండగా పాపంపేట పొలంలోని భూమిని స్వాధీనం చేశారన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ కోర్టు 1990లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం అనంతపురం నగరంలో 106 సర్వే నంబరులో 68 సెంట్లు శోత్రియందారులకు స్వాధీనం చేయమని హైకోర్టు సూచించిందన్నారు. ప్రభుత్వ ప్లీడరు, అడ్వొకేట్ జనరల్, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ అందరూ కలిసి పాపంపేట పొలంలోని భూమిని స్వాధీనం చేశారన్నారు. ఒక 420 వెధవ తనకు సంబంధం లేని ఆస్తులపై కోర్టును తప్పుదోవ పట్టించారన్నారు. 8 మంది బాధితులు సివిల్ కోర్టులో ఫైల్ చేసిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సహదేవనాయుడు అనే వ్యక్తికి 2023లో కోర్టు పర్మినెంట్ ఇంజెంక్షన్ ఇచ్చిందన్నారు. వీరి స్థలాల జోలికి వెళ్లొద్దని హైకోర్టు స్పష్టంగా చెప్పినా ధిక్కరించి తొలగించారని చెప్పారు. రూ. 2 వేల కోట్ల విలువైన భూముల్ని స్వాధీనం చేసుకోవాలనే కుట్రతో కట్టడాలను కూల్చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఆ చుట్టుపక్కల శోత్రియం భూముల్లో ఇళ్లు కట్టుకున్న వారు భయంతో తమను సంప్రదిస్తున్నారన్నారు. 'డబ్బు చెల్లించాలి, లేదంటే ఇళ్లు కూల్చేస్తాం, భూములను ఖాళీ చేయిస్తాం' అనే మెసేజ్‌ను వారందరికీ పరిటాల కుటుంబం పంపిందని ఆరోపించారు. ఇందుకు ఎమ్మెల్యే సునీత మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



షెడ్యూల్ సర్వే నం. 106-1లోని 68 సెంట్ల భూమి అనంతపురం మున్సిపాలిటీ పరిధిలోనిది అంటూ పేర్కొన్న పిటిషనర్ శ్రావణ్‌కుమార్ పూర్వీకులు

**అప్పట్లోనే కలెక్టర్‌కు విన్నవించా..**

అనంతపురం రూరల్ తహసీల్దార్ మోహన్ కుమార్‌కు ఈ కేసులో లొసుగులన్నీ తెలుసని, అందుకే ఏరికోరి ఆయనను ఇక్కడికి తెచ్చుకున్నారని ప్రకాష్ రెడ్డి తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బాధితుల తరఫున అప్పటి కలెక్టర్‌ను కలిసి వివరించగా, అప్పట్లో తహసీల్దార్ మోహన్‌కుమార్ మొత్తం రికార్డులు కలెక్టర్ ముందు ఉంచారన్నారు. మునిసిపాలిటీ పరిధి 106–1 సర్వే నంబరులోని 68 సెంట్లను స్వాధీనం చేయాలని కోర్టు తీర్పునిచ్చిందని, శ్రావణ్‌కుమార్ అడుగుతోంది పాపంపేట 106–1 సర్వే నంబరు భూమి అని, దీనికి ఆయనకు ఎలాంటి సంబంధం లేదంటూ అప్పట్లో అధికారులు హైకోర్టుకు తెలిపారన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ కేసు మునిసిపాలిటీ భూములకు మాత్రమే వర్తిస్తుందనే విషయం తెలిసీ ఎందుకు ఇలా చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కచ్చితంగా ఆర్డీఓ, తహసీల్దార్‌ను కోర్టుకు లాగుతామన్నారు. కలెక్టర్‌కు తెలిసి చేశారా.. తెలీక చేశారా.. ఫలితం మాత్రం అనుభవిస్తారన్నారు. 68 సెంట్ల స్థలాన్ని పరిటాల కుటుంబం స్వాధీనం చేసుకుని కాంప్లెక్స్ కడతారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీపీ వరలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు కురుబ వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, నాయకులు బండి పవన్, గోవిందరెడ్డి, నీరుగంటి నారాయణరెడ్డి, మాదన్న, గోపాల్‌రెడ్డి,అంజనరెడ్డి, ఎర్రిస్వామి, నిఖిల్‌యాదవ్ పాల్గొన్నారు.

### 'సన్'డే.. మండే..



ఎండతాకిడికి ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో నిర్మానుష్యంగా మారిన అనంతపురం టవర్‌క్లాక్ ప్రాంతం

**అనంతపురం అగ్రికల్చర్:** 'సన్' డే చుక్కలు చూపించింది. ఆదివారం గార్లదిన్నెలో 40.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పామిడి, బెళుగుప్ప, పెద్దవడుగూరు, తాడిపత్రి, పుట్లూరు, యాడికి, శింగనమల తదితర మండలాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి, చెన్నేకొత్తపల్లి, తలుపుల, ఎన్పీ కుంట, కొత్తచెరువు, పెనుకొండ, పుట్టపర్తి తదితర మండలాల్లో 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు నమోదయ్యాయి. మిగతా ప్రాంతాల్లో 37 నుంచి 39 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. గత కొన్ని రోజులుగా మడకశిర, శెట్టూరు, బెళుగుప్ప, కనగానపల్లి, రాప్తాడు, గుడిబండ, సోమందేపల్లి తదితర కొన్ని మండలాల్లో మాత్రమే ఉదయం 14 నుంచి 17 డిగ్రీల వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా మిగతా ప్రాంతాల్లో 20 డిగ్రీల మేర నమోదవుతూ సెగలు పుట్టిస్తున్నాయి. దీంతో జనం ఆందోళన చెందుతున్నారు. ఈ సారి ఏప్రిల్, మే నెలలో చాలా మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు కావచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



# నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- 135 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 32,803 మంది విద్యార్థులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** విద్యార్థుల జీవితంలో తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాసే రోజు రానే వచ్చింది. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొత్తం 135 కేంద్రాల్లో 32,803 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలుంటాయి. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు. ముఖ్యంగా తాగునీరు, ఫర్నీచరు, విద్యుత్ సదుపాయం అన్ని కేంద్రాల్లోనూ ఉండేలా అధికారులు దృష్టి సారించారు.

**ఆర్జేడీ ప్రత్యేక ఫోకస్..**

పరీక్షల నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్న పాఠశాల విద్య ఆర్జేడీ జిల్లాపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. మూడు రోజులుగా జిల్లాలోనే మకాం వేశారు. పరీక్షల నిర్వహణలో ఏ చిన్నపొరబాటు చేసిన ఉపేక్షించబోనని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది.

**గంట ముందుగానే చేరుకోవాలి..**

తొలిరోజు విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. హాల్‌టికెట్ నంబరు ఆధారంగా ఏ గది ఎక్కడుందో చూసుకోవాలని చెబుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం ఉంటుంది. హాల్‌టికెట్ చూపిస్తే చాలు ప్రయాణానికి అవకాశం కల్పిస్తారు. పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్ల నుంచి ప్రశ్నపత్రాలు తీసుకొచ్చే సమయం, వాటిని ఓపెన్ చూసి విద్యార్థులకు అందజేసే సమయంలో జాగ్రత్తగా ఉండాల్సి ఉంది. మీడియంను ఒకటికి రెండు సార్లు పరిశీలించి సంబంధిత ప్రశ్నపత్రం ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. ఏమాత్రం తారుమారైనా విద్యార్థులు నష్టపోతారనే విషయాన్ని ఇన్విజిలేటర్లు గుర్తుపెట్టుకోవాలని చెబుతున్నారు. పేపర్ లీక్ చేస్తే అడ్డంగా బుక్ అవుతారని, భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరిస్తున్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో కేంద్రాల్లోకి సిబ్బంది కోసం టీ, కాఫీ బయట నుంచి తీసుకురాకూడదు. పొరబాటున ఏ ఒక్క వ్యక్తి బయటకు వచ్చినా అందుకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారి, ఎంఈఓలను బాధ్యులను చేస్తారు.



రాయదుర్గంలోని ఓ సెంటర్‌లో హాల్ టికెట్ల నంబర్లు వేస్తున్న అధికారులు

**పటిష్ట బందోబస్తు**

**అనంతపురం:** పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ పి. జగదీష్ పేర్కొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. పరీక్షలు ముగిసేంత వరకు కేంద్రాల సమీప ప్రాంతాల్లో జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు మూసివేయాలన్నారు.

**అందరూ సహకరించాలి**

ప్రతిష్టాత్మకమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలి. కేంద్రాల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఎవరి స్థాయిలో వారు బాధ్యతగా పని చేయాలి. ఏ చిన్న పొరబాటుకూ తావివ్వొద్దు. చాలా కఠినమైన నిబంధనలు అమలులో ఉన్నాయనే సంగతిని ఎవరూ మరవొద్దు. – ఎం.ప్రసాద్‌బాబు, డీఈఓ

## క్లుప్తంగా

### ఏడీఏ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

- కొన్ని ఫైళ్లు దగ్ధం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ



ఏడీఏ కార్యాలయం వద్ద మంటలు ఆర్పుతున్న దృశ్యం

**ఉరవకొండ:** ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) కార్యాలయంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఏడీఏ కార్యాలయం పక్కనే ఉన్న చెత్తకు నిప్పంటుకుని కిటికీలో నుంచి నిప్పు రవ్వలు పడడంతో మంటలు చెలరేగాయి. అటుగా వెళ్తున్న వారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఫైరింజన్ చేరుకుని మంటలు ఆర్పింది. అప్పటికే కొన్ని ఫైళ్లు కాలిపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ జగదీష్ పరిశీలించారు.

### రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



అనంతపురం నాల్గో పట్టణ పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లతో మాట్లాడుతున్న సీఐ సాయినాథ్

**అనంతపురం:** జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాల్లో చురుకుగా ఉండే రౌడీషీటర్లకు ఆయా పీఎస్‌ల అధికారులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం వారి జీవన విధానం, ప్రవర్తనలపై ఆరా తీశారు. నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రౌడీషీటర్‌పై పోలీసు నిఘా ఉంటుందని, వారి ప్రతి కదలికనూ పోలీసులు పసిగడుతూ ఉంటారని, నేరాలకు పాల్పడితే మీతో పాటు మీ కుటుంబసభ్యులూ సమాజంలో గౌరవంగా జీవించలేని పరిస్థితి ఉంటుందన్నారు. నేరాల జోలికి వెళ్లకుండా బుద్ధిగా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

### చీనీ చెట్ల నరికివేత



**పుట్లూరు:** మండలంలోని గరుగుచింతలపల్లిలో శనివారం రాత్రి రైతు నాగరాజుకు చెందిన 110 చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఉదయాన్నే తోట వద్దకు వెళ్లిన ఆయన విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకట నరసింహ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# మీ మార్కులు మీరే వేసుకోండి!

- బీటెక్‌లో స్వయం ఆన్‌లైన్ కోర్సులు తప్పనిసరి
- మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులకు రెండో సెమిస్టర్‌లో 100 మార్కులకు చొప్పున పరీక్షలు
- కోర్సు పూర్తయ్యాక ఆన్‌లైన్ ద్వారా ఐఐటీ ప్రొఫెసర్లతో మూల్యాంకనం, మార్కుల కేటాయింపు
- ఈ మార్కుల నమోదుకు నేరుగా ఆయా ఇంజినీరింగ్ కళాశాలల సిబ్బందికి స్వేచ్ఛ
- జేఎన్‌టీయూ (ఏ) పరీక్షల విభాగం ఉన్నతాధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు





జేఎన్‌టీయూ (ఏ) ముఖ ద్వారం

**అనంతపురం:** విశ్వసనీయత, సప్రమాణత అనేవి పరీక్షల మూల్యాంకనం యొక్క కనీస ధర్మం. మార్కుల నమోదు ప్రక్రియ అనేది అత్యంత రహస్యంగా, పకడ్బందీగా నిర్వర్తించాల్సి ఉంటుంది. తద్వారా అందే సర్టిఫికెట్ చెల్లుబాటు అవుతుంది. అయితే జేఎన్‌టీయూ(ఏ) పరీక్షల విభాగం ఉన్నతాధికారులు కనీస నిబంధనలు పాటించకుండా మార్కుల నమోదును నేరుగా ఆయా కళాశాలలకు అప్పగించి వృత్తి ధర్మాన్ని విస్మరించారు. మీకు ఇష్టం వచ్చిన మార్కులు మీరే నమోదు చేసుకోండి అంటూ స్వేచ్ఛను ఇచ్చేశారు. వర్సిటీ పరీక్షల విభాగం అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**'స్వయం 'కోర్సులు తప్పనిసరి..**

సాంకేతిక కోర్సులను అభ్యసించే విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు వీలుగా స్వయం పేరుతో ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఆన్‌లైన్‌లో తమకు నచ్చిన కోర్సును పూర్తి చేసిన అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్‌లోనే పరీక్ష నిర్వహిస్తారు. బీటెక్ మూడు, నాల్గో సంవత్సరం విద్యార్థులకు రెండో సెమిస్టర్‌లో 100 మార్కులకు చొప్పున ఈ స్వయం కోర్సులను తప్పనిసరి చేశారు. పరీక్షల అనంతరం ఆన్‌లైన్ విధానంలోనే ఐఐటీ, ఎన్‌ఐటీ ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించి మార్కులు కేటాయిస్తారు. ఇక్కడి వరకూ అంతా బాగానే ఉన్నా... ఈ తర్వాతి ప్రక్రియను జేఎన్‌టీయూ(ఏ) పరీక్షల విభాగం అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించిన మార్కులను తప్పనిసరిగా వర్సిటీ పరీక్షల విభాగం సిబ్బంది నమోదు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వంలోనూ ఇదే తరహాలోనే మార్కులు నమోదు చేశారు. తాజాగా నిబంధనలకు విరుద్ధంగా నేరుగా ఆయా కళాశాలలకే ఈ బాధ్యత అప్పగించారు. దీంతో వారికి ఇష్టం వచ్చిన రీతిలో మార్కులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. స్వయం కోర్సుల్లో మార్కులు నమోదు చేసే అధికారం ఆయా ఇంజినీరింగ్ కళాశాలలకు అధికారం లేదు. లేని అధికారాన్ని కట్టబెట్టారు. ఇంటర్నల్ మార్కుల తరహాలోనే స్వయం కోర్సుల మార్కులు నమోదు చేయాలని పరీక్షల విభాగం ఉన్నతాధికారులు పూర్తి స్వేచ్ఛను ఇచ్చేశారు. దీంతో తమ కళాశాల విద్యార్థులకు ఎన్ని మార్కులు కావాలంటే అన్ని మార్కులు వేసేస్తూ ఇంజినీరింగ్ కళాశాలల సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. స్వయం కోర్సులు స్వీయ నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ప్రవేశపెట్టారు. విద్యా ప్రణాళికలో పేర్కొన్న అంశాలే కాకుండా పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు కోర్సులు స్వయంగా నేర్చుకునేందుకు స్వయం కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. వీటికి మార్కులు సైతం కేటాయించారు. క్రెడిట్లు లెక్కిస్తారు. ఇలాంటి కీలకమైన అంశాలను తేలికగా తీసుకోవడమే కాకుండా మార్కుల నమోదును ఏకంగా కళాశాలలకు అప్పగించడం వివాదస్పదమవుతోంది.

**నియంత్రణ లేని తీరు..**

పరీక్షల విభాగంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ గైర్హాజరైనా ఫలితాలను విడుదల చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఫలితాలు విడుదల చేసే ముందు అన్ని పరిశీలించి, సర్క్యులర్‌పై కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సంతకం చేసిన తర్వాతనే ఫలితాలు ప్రకటిస్తారు. కానీ ఈ నెల 5న ఎంటెక్, సప్లిమెంటరీ ఫలితాలను కంట్రోలర్ లేకుండానే ప్రకటించారు. ఫలితాల విడుదల సర్క్యులర్‌పై కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సంతకం లేకపోవడమే ఇందుకు నిదర్శనం. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టమ్ పాస్‌వర్డ్ అత్యంత కీలకం. ఇలాంటి పరిస్థితుల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పాస్‌వర్డ్ అప్పగించి ఫలితాలు ప్రకటించడం పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. కేవలం ఎక్సెల్ షీట్‌లోనే ఫలితాలు ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో పాస్‌వర్డ్‌తో ఎక్సెల్ షీట్ ఓపెన్ చేసి మార్కులు తారుమారు చేస్తే ఎవరు జవాబుదారీ వ్యవహరిస్తారనే ప్రశ్నలూ ఉత్పన్నమవుతున్నాయి.

**పరిశీలిస్తాం**

స్వయం కోర్సులకు సంబంధించి మార్కులను ఆయా కళాశాలలే నమోదు చేసినా, ఆ తర్వాత ర్యాండమ్‌గా వాటిని మేమూ పరిశీలిస్తాం. సీఈ గైర్హాజరైనా ఫలితాలను విడుదల చేశారనడం అవాస్తవం. సర్క్యులర్‌పై ఆయన సంతకం లేనంత మాత్రాన ఆయన గైర్హాజరైనట్లు కాదు. – ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, జేఎన్‌టీయూ (ఏ)

# డబ్బా కొట్టుకునేందుకే ఆవిర్భావ వేడుక

- దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయంపై కేంద్రాన్ని చంద్రబాబు, పవన్ నిలదీయాలి
- లైనింగ్ పనులతో హంద్రీనీవాకు మరణశాసనమే
- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

**ఉరవకొండ:** డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తన సొంత డబ్బా కొట్టుకునేందుకే కాకినాడలో జనసేన ఆవిర్భావ సభ ఏర్పాటు చేశారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు గురించి ఇందులో ఒక్కమాట కూడా ప్రస్తావించకుండా తన నైజాన్ని పవన్ కళ్యాణ్ బయట పెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవిర్భావ సభ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పి ప్రజలను పవన్ కళ్యాణ్ ఆశ్చర్యపరిచారన్నారు. హిందీ- తమిళ్ వివాదం తెరపైకి తెచ్చి మరో వివాదానికి తెరలేపారన్నారు. ప్రధాని మోదీ ఏకపక్ష నిర్ణయాలను తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీశారని, ఇదే తరహాలో సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ సైతం కేంద్రాన్ని నిలదీయకపోగా భాషలు, డిలిమిటేషన్‌పై మోదీ సర్కార్‌కు వత్తాసు పలకడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. జిల్లాకు వరదాయినిగా ఉన్న హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ పనులు చేస్తే అది హంద్రీ-నీవా ఆయకట్టు దారులకు మరణశాసనమే అవుతుందన్నారు. హంద్రీ-నీవా కాలువను భవిష్యత్తులో వెడల్పు చేయకుండా ఉండేందుకే కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. జిల్లాలోని 3.50లక్షల ఎకరాలకు సాగు, తాగునీటి అవసరాలతో పాటు చెరువులను నీటితో నింపి భూగర్భ జలాలు పెంపొందించడమే హంద్రీ-నీవా ప్రాజెక్ట్ లక్ష్యమన్నారు. లైనింగ్ పనులు చేపడితే తాగు, సాగునీరుతో పాటు చెరువులకు కూడా నీరు అందకుండా పోతుందన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే హంద్రీనీవా మొదటి దశ 95శాతం, రెండోదశ 65 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం రెండో విడతలో హంద్రీనీవా పనులు ఒక్క కిలోమీటరు చేయకుండా కేవలం కుప్పం ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికి లైనింగ్ పనులు చేపట్టేందుకు సిద్ధమైందని, ఈ నేపథ్యంలోనే హంద్రీ-నీవా పనులను చంద్రబాబు తన ఆదాయ వనరుగా మార్చుకున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీవీరన్న, నాయకులు ఈడిగ ప్రసాద్, ఎర్రిస్వామిరెడ్డి, ఓబన్న, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.





ఆ చెట్లు పచ్చగా కళకళలాడేవి. చూపరులకు కనువిందు చేసేవి. కానీ నేడు నిర్జీవంగా మారాయి. చిగురించే ఆశలన్నీ 'నీరు'గారిపోయాయి. నీరు తక్కువైనా, ఎక్కువైనా నష్టమే అనేందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ దృశ్యం అనంతపురం సెంట్రల్ పార్క్‌లోనిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

# వాహనం బోల్తా

- 18 మందికి గాయాలు, నలుగురి పరిస్థితి విషమం



పరిస్థితి విషమంగా ఉన్న వన్నూరమ్మ



తీవ్రంగా గాయపడిన వరుణ్

**ఉరవకొండ:** స్థానిక 42వ జాతీయ రహదారిపై చిన్నముష్టూరు వద్ద టాటా ఏస్ వాహనం బోల్తాపడిన ఘటనలో 18 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన రేణుక కుమార్తె మౌనిక సీమంతం కార్యక్రమానికి బొమ్మనహాళ్ మండలం హరేసముద్రం గ్రామానికి చెందిన సమీప బంధువులు 30 మంది ఆదివారం టాటా ఏస్ వాహనంలో బయలుదేరారు. చిన్నముష్టూరు వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం రెండు పల్టీలు కొట్టి బోల్తాపడింది. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో వినీత, నాగలక్ష్మి, వరుణ్, వన్నూరమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# 'రాజా'కు ఘన వీడ్కోలు



సాహస జాగిలాన్ని పూలమాలలు, శాలువాతో సత్కరించి ఊరేగిస్తున్న దృశ్యం

**గుంతకల్లు టౌన్:** రైళ్లల్లో పేలుడు పదార్థాల గుర్తింపు, లిక్కర్ అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు విధి నిర్వహణలో సమర్థవంతమైన సేవలందించిన సాహస జాగిలం రాజా (శునకం)కు ఆర్పీఎఫ్ పోలీసులు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. పదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న రాజా పదవీ విరమణను స్థానిక ప్రభాత్‌నగర్‌లోని ఆర్పీఎఫ్ డాగ్ స్క్వాడ్ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన పోలీసు జీపుపై జాగిలాన్ని కూర్చోబెట్టి పూలమాల, శాలువాతో సత్కరించారు. పూలు చల్లుకుంటూ వీధుల్లో ఊరేగించారు. ఆర్పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ వింగ్ కమిషనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ... రైళ్లల్లో దొంగలను పట్టించడంతో పాటు అనేక కేసుల్లో మిస్టరీని ఛేదించడంలో జాగిలం రాజా విశేష ప్రతిభ కనబరిచేదన్నారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బెన్నయ్య, ఏఎస్‌ఐ అబ్రహామ్, డాగ్ హ్యాండ్లర్స్ టి.శంకర్, డి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న జాగిలాన్ని నాందేడ్‌లోని అనిమల్ సొసైటీలో అప్పగించనున్నట్లు తెలిసింది.

# వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

**జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. కామాంధుడి బారి నుంచి తనను తాను కాపాడుకునే క్రమంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకోగా... అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ కౌలు రైతు, జీవితంపై విరక్తితో మరో యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు.**



మృతుడు అమర్‌నాథ్



మృతురాలు కవిత

- **నార్పల:** లైంగిక వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలలోని సుల్తాన్‌పేట కాలనీకి చెందిన కవిత(26), వెంకటశివ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న వెంకటశివ శనివారం రాత్రి గ్రామ శివారులో విడిచిన గొర్రెల వద్దకు కాపలాకు వెళ్లాడు. విషయాన్ని గుర్తించిన అదే కాలనీకి చెందిన యువకుడు బండి లక్ష్మీనారాయణ... ఇంట్లోకి చొరబడి కవితాపై అత్యాచార యత్నం చేశాడు. ఆ సమయంలో కేకలు వేస్తూ అతని బారి నుంచి బయటపడిన ఆమె... లోపలి గదిలోకి వెళ్లి తలుపునకు గడియ పెట్టుకుంది. అదే సమయంలో తలుపులు బద్దలుగొట్టేందుకు లక్ష్మీనారాయణ ప్రయత్నించడంతో దిక్కుతోచని స్థితిలో కవిత ఉరి వేసుకుంది. ఇంతలో శబ్దాలకు చుట్టుపక్కల వారు.నిద్ర లేచి గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి లక్ష్మీనారాయణ పారిపోయాడు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించిన స్థానికులు అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కవితను గమనించి సమాచారం ఇవ్వడంతో వెంకటశివ అక్కడకు చేరుకుని బోరున విలపించాడు. రెండేళ్లుగా కవితను బండి లక్ష్మీనారాయణ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని, ఈ నేపథ్యంలోనే కవితను హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం చేశాడంటూ తల్లి నాగసుబ్బమ్మ చేసిన ఫిర్యాదు మేరకు సీఐ కౌలుట్లయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.
- **పెద్దవడుగూరు:** మండలంలోని గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన రైతు తలారి రాము(43) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న రాము... మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. దిగుబడి రాక అప్పులకు వడ్డీల భారం పెరిగింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడుతున్న రాము... ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.
- **కూడేరు:** మద్యం మత్తులో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కలగళ్లకు చెందిన అమర్‌నాథ్(28) మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరిగేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లోకి చేరుకుని తలుపులు వేసుకుని నిద్రించాడు. ఇంటి బయట నిద్రించిన తండ్రి కొండయ్య ఆదివారం ఉదయం లేచి తలుపులు తీయాలని పిలిచినా లోపలి నుంచి ఎలాంటి స్పందన లేకుండా పోయింది. దీంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లి చూశారు. అప్పటికే ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించిన కుమారుడిని చూసి సమాచారమివ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, అమర్‌నాథ్‌కు భార్య ఉంది. సంతానం లేరు.



### అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతిపై అనుమానాలు



యోజిత (ఫైల్)

**బుక్కరాయసముద్రం:** మండలంలోని జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ యోజితా సాహో (27) మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బీకేఎస్ పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయ్‌పూర్ జిల్లా దుర్గ్ గ్రామానికి చెందిన యోజిత సాహో బుక్కరాయసముద్రంలోని తాను నివాసముంటున్న అద్దె గృహంలో శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు రాయ్‌పూర్ నుంచి ఆదివారం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి చేరుకున్నారు. కుమార్తె మృతదేహాన్ని చూడగానే బోరున విలపించారు. అనంతరం ఆమె అద్దెకున్న ఇంటిని పరిశీలించారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని ఈ సందర్భంగా వారు పోలీసులకు తెలిపారు. కుమార్తె ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లు, బీకేఎస్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేశారు. మృతురాలి ఐ ఫోన్, లాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వర్సిటీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో యోజితా మృతదేహాన్ని తీసుకుని తల్లిదండ్రులు స్వగ్రామానికి తరలివెళ్లారు.

### అంగన్‌వాడీలకు అందని నూనె

**తాడిపత్రి రూరల్:** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు వంట నూనె ప్యాకెట్లు అందలేదు. సగానికి పైగా కేంద్రాలకు నూనె ప్యాకెట్లు అందక పోవడంతో లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక పోతున్నామని కార్యకర్తలు వాపోతున్నారు. ప్రతి నెలా మొదటి వారంలో పంపిణీ కార్యక్రమం పూర్తి అవుతుంది. కానీ ఈ నెల రెండవ వారం దాటుతున్న కొన్ని కేంద్రాలకు పంపిణీ చేయకపోవడం గమనార్హం. గతంలోనూ పలుమార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు, వంట నూనె పంపిణీలో వ్యత్యాసాలు చోటు చేసుకున్నాయి. ఈ లోపాన్ని సరిదిద్దడంలో అధికారులు విఫలమవుతూ వస్తున్నారు. నూనె ప్యాకెట్లు లేకపోవడంతో ఇతర సరుకులు సైతం తీసుకునేందుకు లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు. వీటి కోసం గర్భిణులు, బాలింతలు రోజూ అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ అంశంపై తాడిపత్రి స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ శంకరయ్య మాట్లాడుతూ.. రేషన్ డీలర్లకు సంబంధించిన ఈ-పాస్ మిషన్లకు స్టాక్‌ను అప్‌డేట్ చేయకపోవడంతో సమస్య తలెత్తినట్లు వివరించారు. డీఎం కార్యాలయంలో అప్‌డేట్ చేసిన వెంటనే డీలర్ల వద్ద ఉన్న ఈ-పాస్ మిషన్ల ద్వారా పంపిణీ జరుగుతుందన్నారు.

### పథకాల అమలులో ప్రభుత్వం విఫలం : సీపీఐ

**పెద్దవడుగూరు:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూటమి పెద్దలు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కార్యవర్గ సభ్యుడు రాజారెడ్డి, తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి రంగప్ప, మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ ధ్వజమెత్తారు. పెద్దవడుగూరు సీపీఐ మండల శాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ప్రజల సమస్యలకు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బీటుపల్లి నారాయణ, తాడిపత్రి సీపీఐ టౌన్ కార్యదర్శి చిరంజీవియాదవ్, గుత్తి మండల కార్యదర్శి రాందాస్, గుత్తి పట్టణ కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

### అరటి తోట దగ్ధం



కాలిన తోటను చూపుతున్న రైతు నరసింహులు

**బెళుగుప్ప:** అగ్ని ప్రమాదంలో అరటి తోట దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన రైతు నరసింహులు తనకున్న ఆరు ఎకరాల్లో అరటి పంట సాగు చేపట్టాడు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. ఆదివారం ఉదయం తోట వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని నిప్పు రవ్వలు ఎగిసి పడి మంటలు వ్యాపించాయి. దీంతో సుమారు 2.5 ఎకరాల్లోని డ్రిప్ పరికరాలతో పాటు అరటి చెట్లు కాలిపోయాయి. సమాచారం అందుకున్న కళ్యాణదుర్గం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. దాదాపు రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

# నియామకాల్లో నిర్లక్ష్యంపై కొరడా

- ఇన్విజిలేషన్ డ్యూటీల్లో అవకతవకలపై ఆర్జేడీ చర్యలు
- ఐదుగురికి షోకాజ్ నోటీసులు
- తీవ్ర చర్చనీయాంశమైన 'సాక్షి' వరుస కథనాలు

సాక్షి ఎఫెక్ట్..

**అనంతపురం ఎడ్యుకేషన్:** పదో తరగతి పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) కొరడా ఝళిపించారు. ఐదుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇన్విజిలేషన్ డ్యూటీల కేటాయింపుల్లో గందరగోళం, అంధులు, పక్షవాత బాధితులు, దివ్యాంగ టీచర్లు, చివరకు రిటైర్డ్ అయిన వారినీ విధులకు కేటాయించిన వైనంపై 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. 'పది పరీక్షల నిర్వహణలో గందరగోళం', 'పదింతల నిర్లక్ష్యం' కథనాలు విద్యాశాఖలో ప్రకంపనలు సృష్టించాయి. సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ అయ్యాయి. ప్రాథమిక విద్య కమిషనర్, కలెక్టర్ కూడా స్పందించారు. ఈ క్రమంలో పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, డెప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, అనంతపురం ఎంఈఓ వెంకటస్వామి, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, పరీక్షల విభాగం అసిస్టెంట్ రామాంజనేయులుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారిచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలుంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రధాన కారణంగా భావిస్తున్న కీలక అధికారిపై వేటు తప్పదనే ప్రచారం సాగుతోంది.

**'టిస్' ఉన్నా అలసత్వం..**

టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్) ద్వారా ఇటీవల ఉపాధ్యాయుల పూర్తి వివరాలు సేకరించారు. ఏ స్కూల్‌లో ఏ టీచరు పని చేస్తున్నాడు... పేరు, వయసు, పుట్టిన రోజు, పీహెచ్ కేటగిరీ తదితర వివరాలున్నాయి. ఫిబ్రవరి 28న రిటైర్డ్ అయిన వారి వివరాలు కూడా ఇందులో అప్‌డేట్ అయ్యాయి. ఈ వివరాలన్నీ డీఈఓ కార్యాలయంలో ప్రభుత్వ పరీక్షల విభాగం పక్క గదిలోనే లభిస్తాయి. అయినా ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం చూస్తుంటే పరీక్షల నిర్వహణ విభాగం అధికారులు ఎంత నిర్లక్ష్యంగా పనిచేశారో అర్థం చేసుకోవచ్చు.

**ఎంఈఓలు, హెచ్ఎంలకు పంపి ఉంటే...**

10–15 రోజుల ముందే ఎంఈఓల ద్వారా ప్రధానోపాధ్యాయులకు జాబితాలు పంపి రిమార్కులు అడిగి ఉంటే కూడా చాలా వరకు తప్పిదాలకు అవకాశం ఉండేదికాదు. అలా చేయకుండా కేవలం పరీక్షల విభాగం ఒంటెద్దు పోకడలతో తీసుకున్న నిర్ణయాలు అనేకమంది టీచర్లను ఇక్కట్లు పాలు చేశాయి. ఈ క్రమంలోనే అంధులు, పక్షవాత బాధితులు, చంటిపిల్లల తల్లులు, బాలింతలు, దివ్యాంగ టీచర్లు, రిటైర్డ్ టీచర్లు, మెడికల్ లీవ్‌లో ఉన్న వారినీ ఇన్విజిలేటర్లుగా నియమించారు. ఇలాంటి వారే 200 మంది దాకా ఉన్నట్లు తెలిసింది. పరీక్ష కేంద్రాల చీఫ్‌లకు అందజేసి చేతులు దులుపుకోవడం వల్ల సమాచార లోపించి ఆర్డర్లు జారీ చేసి రెండు రోజులు దాటినా 40 శాతానికి మందికి పైగా ఉత్తర్వులు అందజేలేదు. ఈ విషయంపైనా ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు.

## క్లుప్తంగా

### డ్రోన్లతో నిఘా



ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో డ్రోన్ తీసిన చిత్రం

అనంతపురం: మహిళల భద్రతలో భాగంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం శివారు కాలనీల్లో టూటౌన్ పోలీసులు డ్రోన్లతో నిఘా పెడుతున్నారు. ఎస్ఐ రుష్యేంద్రబాబు ఆధ్వర్యంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ పరిసర ప్రదేశాలు, నాయక్ నగర్, ఆదర్శ నగర్, విద్యుత్ నగర్, జీసస్ నగర్, మిస్సమ్మ కాంపౌండు, తదితర ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేశారు. ఈవ్‌టీజింగ్, ఓపెన్ డ్రింకింగ్‌లపై దృష్టి సారించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పరిశీలించారు.

### ఏపీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ఏపీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో సివిల్ సర్వీస్, గ్రూప్–1, గ్రూప్–2 కోసం స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలన్నారు.

### దుస్తుల పంపిణీ

అనంతపురం కల్చరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆదర్శ నగర్‌లో గుడిసెల్లో ఉంటూ జీవనం సాగిస్తున్న ప్రజలకు నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దుస్తులు, 8 రకాల నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### 11 కేంద్రాల్లో పది పరీక్షలు

రాప్తాడు: నియోజకవర్గంలో 11 కేంద్రాల్లో 2,453 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నారని ఎంఈఓ మల్లికార్జున ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష జరిగే రోజుల్లో టెన్త్ హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా విద్యార్థులు ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. కాగా.. పరీక్షల నిర్వహణ కోసం నియోజకవర్గంలో దాదాపుగా 200 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఆయా రూట్లలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక సీఎస్, డీఓలను నియమించారు. 240 మంది విద్యార్థులకు మించి ఉన్న కేంద్రానికి అదనంగా డీఓను ఏర్పాటు చేశారు. పది పరీక్షలు ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకూ జరగనున్నాయి.

# టౌన్ ప్లానింగ్ అస్తవ్యస్తం..!

- ముగ్గురు సిబ్బందితోనే నెట్టుకొస్తున్న వైనం
- అధిక సంఖ్యలో పోస్టులు ఖాళీ
- నగరంలో విచ్చలవిడిగా అనధికార భవన నిర్మాణాలు



అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగం అస్తవ్యస్తంగా మారింది. కీలకమైన పోస్టుల్లో అధికారులు లేకపోవడంతో అందుబాటులో ఉన్న ముగ్గురు అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. నగరంలో అడ్డదిడ్డంగా నిర్మాణాలు జరుగుతున్నా.. ఇష్టారాజ్యంగా అడ్వటైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేసినా.. కూటమి నేతల ప్రోద్బలంతో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. నగరపాలక సంస్థకు రూ.లక్షల్లో ఆదాయం గండికొడుతూ కొందరు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా దోపిడీ చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. నగరపాలక సంస్థలో పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ జరగడంతో పాటు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటేనే అనధికార నిర్మాణాలకు అడ్డుకట్ట వేయవచ్చని నగరపాలక సంస్థ సిబ్బందే బహిరంగంగా చెబుతున్నారు.

**కీలక పోస్టులు ఖాళీ**

నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు టీపీఓలు, నలుగురు టీపీఎస్‌లు, నలుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. కాగా ఇక్కడ ఏసీపీ పోస్టులో ఒకరు ఉన్నా.. ఆయన దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. టీపీఓ, ఇద్దరు టీపీఎస్‌లు మాత్రమే ఉన్నారు. ఈ ముగ్గురితోనే టౌన్ ప్లానింగ్ విభాగం నడుస్తోంది. అందులోనూ వీరిలో ఓ టీపీఎస్‌పై విమర్శలు ఉండడంతో ఆమెను క్షేత్రస్థాయికి పంపలేదు. ఇక మిగతా ఇద్దరు ఆఫీసు కదలకుండా తిష్ట వేశారు. కేవలం టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు వదిలేసి వీరు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. అదేవిధంగా గతంలో నలుగురు కార్యదర్శులకు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా అవకాశం కల్పించగా, అది కాగితాలకే పరిమితమైంది. టీపీఓ, టీపీఎస్‌లిద్దరూ..కార్యదర్శులను పక్కన పెట్టేశారన్న విమర్శలున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, అడ్వటైజ్‌మెంట్ తదితర వాటిని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారులను తెచ్చుకోవడంలోనూ ప్రజాప్రతినిధులు విఫలమైనట్లు స్పష్టంగా తెలుస్తోంది.

### రూ.కోట్లలో ఆదాయానికి గండి

నగరపాలక సంస్థలోని 50 డివిజన్లకు సంబంధించి 74 సచివాలయాల పరిధిలో 500 నుంచి 1000 ఇళ్ల వరకూ నిర్మాణాలు జరుగుతున్నాయి. సాయినగర్, అరవింద నగర్, రాంనగర్, శ్రీనగర్ కాలనీ, కమలానగర్, రాజు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, రెవెన్యూ కాలనీ, శారద నగర్, అరవింద నగర్, విద్యుత్ నగర్, అశోక్ నగర్, ఆదర్శ నగర్, హౌసింగ్ బోర్డు, ఆదిమూర్తి నగర్, లక్ష్మీనగర్, వేణుగోపాల్ నగర్, తదితర ప్రాంతాల్లో భారీగా నిర్మాణాలు జరుగుతున్నాయి. కాగా కొన్ని భవనాలకు 14 శాతం ట్యాక్స్ లేకుండా నిర్మాణాలు జరిగేలా టౌన్ ప్లానింగ్‌లోని కీలక అధికారి పరోక్షంగా సహకరించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా అడ్వైటైజ్‌మెంట్ ట్యాక్స్ విషయంలోనూ పలు ఏజెన్సీలతో టౌన్ ప్లానింగ్ కీలక అధికారిణి లోపాయికార ఒప్పందం చేసుకుని రూ.లక్షల్లో నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇక భవనాల క్రమబద్ధీకరణలోనూ (బీపీఎస్) అధికారులు దృష్టిసారించడం లేదు.

### ఉన్నతాధికారులకు నివేదిస్తాం

టౌన్ ప్లానింగ్‌లో చాలా పోస్టులు ఖాళీ ఉన్నాయి. వాటి భర్తీకి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించనున్నాం. నగరంలో అనధికార నిర్మాణాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేలా సంబంధిత సిబ్బంది ఆదేశాలు ఇస్తున్నాం. త్వరలో చర్యలు తీసుకుంటాం.

– బాలస్వామి, కమిషనర్, నగరపాలక సంస్థ

### 200 భవనాలకు చార్జ్‌షీట్లు

కొన్నేళ్లుగా నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో నిర్మాణం ఒకలా తీసుకోవడం.. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడం పరిపాటిగా మారిపోంది. ఈ క్రమంలో అరవింద నగర్, కమలా నగర్, సాయి నగర్, హౌసింగ్ బోర్డు, వేణుగోపాల్ నగర్, రాంనగర్, శ్రీనగర్ కాలనీ, లక్ష్మీనగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, అరుణోదయ కాలనీ, రెవెన్యూ కాలనీ, రామచంద్ర నగర్, తదితర ప్రాంతాల్లోని భవనాలకు 200 వరకు చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. చార్జ్‌షీట్లు పెనాల్టీలు వేస్తే రూ.100 కోట్ల వరకు నగరపాలక సంస్థకు ఆదాయం వస్తుంది. వీటి వసూళ్లపైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని పూర్తి స్థాయిలో అధికారులను ఏర్పాటు చేయడంతో పాటు టౌన్ ప్లానింగ్ విభాగంలో చేతివాటం ప్రదర్శిస్తున్న పలువురు సిబ్బందిపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

**నగరపాలక సంస్థ వివరాలు..**

| | |
|---|---|
| డివిజన్లు | 50 |
| సచివాలయాలు | 74 |
| హౌస్ హోల్డ్స్ | 77,000 |
| నగరంలో జరుగుతున్న నిర్మాణాల సంఖ్య | 500 నుంచి 1000 |
| టౌన్ ప్లానింగ్‌లో ఉండాల్సిన సిబ్బంది | 16 |
| ప్రస్తుతం ఉన్న సిబ్బంది | 3 |
| చార్జ్‌షీట్లు దాఖలు చేసిన భవనాల సంఖ్య | 200పై మాటే |
| చార్జ్‌షీట్ల ద్వారా జరిమానా వసూలు చేస్తే వచ్చే ఆదాయం | రూ.100 కోట్లపై మాటే |

### కాంచన కుమారి సేవలు ప్రశంసనీయం



కాంచన కుమారి (ఫైల్)

అనంతపురం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న కాంచన కుమారి సేవలు ప్రశంసనీయమని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ కొనియాడారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న కాంచన కుమారి.. మూడు నెలలుగా హైదరాబాద్ బసవతారకం ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆదివారం ఉదయం పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆదిమూర్తి నగర్‌లో కాంచన కుమారి మృతదేహానికి ఉమ్మడి ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ నివాళులర్పించారు. తన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించే వారని ప్రశంసించారు.

### అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



అక్కులప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ నాయకులు

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువు గ్రామ సర్పంచ్ ముత్యాలమ్మ భర్త, వైఎస్సార్‌సీపీ కార్యకర్త అక్కులప్ప (58) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్కులప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ తరఫున అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్కేయూలో ఇష్టారాజ్యం

- గడువు ముగిసినప్పటికీ జన్మభూమి క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్‌ను కొనసాగిస్తున్న నిర్వాహకులు
- అధికారుల ఆదేశాలు బేఖాతరు



షాపింగ్ కాంప్లెక్స్‌లో అక్రమంగా నిర్మించిన షెడ్డు



షాపింగ్ కాంప్లెక్స్ వెనుక చెత్తాచెదారం పడేసిన దృశ్యం

అనంతపురం: ఎస్కేయూలోని జన్మభూమి క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి గత నెలాఖరునే టెండర్ గడువు ముగిసింది. అధికారులు జన్మభూమి క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్ గదులను మూసివేయాలని ఆదేశించినా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ఏ అధికారి తమను అడ్డుకుంటాడో చూస్తామంటూ బరితెగిస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎలాంటి హోటల్ నిర్వహించకూడదని టెండరు ఖరారైనప్పుడు నిర్దేశించారు. అయితే ఏకంగా స్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మించారు. రాత్రి 10 గంటల వరకూ అనధికారికంగా హోటల్ నడుపుతూ ఫాస్ట్‌ఫుడ్ అమ్ముతున్నారు. తాగుబోతులు అక్కడే వీరంగం సృష్టిస్తున్నారు. హాస్టల్‌కు వెళ్లే దారిలో హోటల్ నిర్వహిస్తుండటంతో అమ్మాయిలు ఇబ్బందులు పడుతున్నారు. క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ప్రొఫెసర్లు, ఉద్యోగులు, పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అదే కాంప్లెక్స్ వెనుక చెత్తాచెదారం వేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. గడువు ముగిసినప్పటికీ జన్మభూమి క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్‌ను కొనసాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.మధుసూదన్ రెడ్డిని సంప్రదించగా.. పోలీసుల సహకారంతో షాపులు ఖాళీ చేయిస్తామన్నారు. త్వరలోనే టెండర్లు ఆహ్వానించి, ఖరారు చేస్తామని పేర్కొన్నారు.

## పంపనూరులో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు అనంతరం స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేపట్టారు. అలాగే ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

# ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా



జేఎన్‌టీయూ(ఏ)లో నివాళులర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు



నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం



పొట్టి శ్రీరాములు చిత్రపటంతో ర్యాలీగా వెళ్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఎంతో మందికి ఆదర్శమని మేయర్ వసీం పేర్కొన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని నగరపాలక సంస్థలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మద్రాసు రాజధానిగా ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో తెలుగువారి బాధలపై ఉద్యమించి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన పోరాటంలో ప్రాణాలు కూడా లెక్క చేయకుండా అమరులయ్యారన్నారు. ఆ మహనీయుని మరణానంతరం ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, లాలూ, సైఫుల్లాబేగ్, రాజేశ్వరి, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ బీఎల్ నరసింహ, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా పోలీసు కార్యాలయంలో..**

అనంతపురం: పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేద్దామని జిల్లా అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఇలియాజ్ బాషా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్ఐలు పవన్ కుమార్, బాబు, ఆర్ఎస్ఐలు జాఫర్, మగ్బూల్, బాబ్‌జాన్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జేఎన్‌టీయూలో..**

జేఎన్‌టీయూ అనంతపురంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించి శ్రీరాములు సేవలు మరువలేనివన్నారు.

**ఎస్కేయూలో..**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వెంకట రమణ, సెరికల్చర్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ, ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు

ఆత్మకూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఈసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు గణాచారి శ్రీనివాసులు, వెంకటేష్, మధు, హర్షవర్ధన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో..**

అనంతపురం టవర్‌క్లాక్: తమిళనాడు రాష్ట్రం నుంచి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చ నరసింహులు అన్నారు. ఆదివారం కొత్తూరు అమ్మవారి శాల నుంచి సంఘం ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే పాతూరు అమ్మవారి శాల నుంచి ఐరన్ బ్రిడ్జ్ వద్ద వరకు ర్యాలీ చేపట్టారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాతూరు అమ్మవారి శాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పీవీ నాగరత్నం, తిరువీదుల జగదీష్, శబరి, మహిళా సంఘం నాయకురాళ్లు అనురాధ, ఇందిర, మంజునాథ్ పాల్గొన్నారు.